# పాటలు పాడే భార్య

నాకు పాటలంటే చాలా యిష్టం. నిజానికి పాటలంటే యిష్టపడని వాళ్ళెవరూ వుంటారనుకోను. పాటలమహాత్మ్యానికి జంతువులు లొంగుతాయని, రాళ్ళు కరుగుతాయని వింటాం! శ్రీకృష్ణుని మురళీగానానికి పశువులమంద మైమర్చేదట. నాగస్వరానికి నాగుబాము పడగవిప్పి ఆడడం మనం కళ్ళారా చూసే విషయమే. గంధర్వుల పాటలకు రాళ్ళుకూడా కరిగేవట.

ఒక శ్రావ్యమైన పాట వినబడితే ప్రాణం లేచివచ్చినట్టవుతుంది. చెప్పలేని ఆనందం కలుగుతుంది. నాకు పాట రాదు. కాని మనస్సులో పాడుకోగలను. అన్నిపాటలరాగాలు చెవుల్లో గింగిర్లెత్తుతాయి. పాడేవాళ్ళ పాటల్ని సరిదిద్దగలను. కొంతమందికి పాడడం రాకపోయినా, ఆ కళని కొన్నియాంత్రిక సాధనాలవల్లనైనా చూపుతారు. వాటిని నే నేర్చుకోలేదు.

నా గానకళా ప్రియత్వానికి చిహ్నంగానూ, నా కళా పిపాసను సంతృప్తిపర్చుకునేందుకు వీలుగానూ ఓగాన (కళా) సరస్వతిని వివాహమాడ దల్చుకున్నాను.

♦ ♦ ♦ ♦

పెళ్ళిచూపులవేళే అనుకున్నాను. నీలవేణి నేను వెతికే లతేనని, సన్నని, నాజూకైన వేళ్ళతో, వీణాధ్వనుల్ని ప్రసరిస్తూ "నను బ్రోచే వారెవరురా" అని పాడింది. "నేనే" అని లోపలనుకుని, నీలవేణిని వివాహమాడ్డానికే నిశ్చయించుకొన్నాను.

మాటల సందర్భంలో యిందాకే విన్నవించడం మర్చాను— నేను కూడా ఓ గేయకవినని, ప్రతీ గాయకుడూ

కవితా లేకపోవచ్చును; కానికవిత్వంలో యింతో అంతో ప్రవేశమున్న ప్రతివాడూ గానకళమీద కొంత ప్రభావాన్ని కలిగి వుంటాడు. నా పాటలను ఆలాపించే గానకోకిల నీలవేణి, అందుకే పై నిశ్చయానికి వచ్చింది.

♦ ♦ ♦ ♦

నీలవేణి చిన్నప్పటినుంచీ కర్నాటక సంగీతంలో పుట్టి పెరిగింది. ఆమె కాపరాని కొచ్చిన కొన్నాళ్ళకు తెల్సుకున్నాను. నీలవేణి దృష్టిని తేలిక సంగీతంవైపు మరల్చడం తేలికకాదని. లోపలఎంత గాఢాభిమానమున్నా నీలవేణి నా ప్రోద్బలంవల్ల నేమి, సహజంగా సంగీతంమీద గల ఆకాంక్షచేతనైతేనేమి, క్రమంగా హిందూస్థానీ సంగీతంవైపు మొగ్గడం, హిందీసినిమా పాటల్ని నేర్చుకోవడం ఆరంభించింది. నా పాటలకుకూడా రాగాలుకట్టి, వాటిని శ్రావ్యంగా పాడి, ఆనందాన్ని కలిగించేది, ఆనందించేది.

♦ ♦ ♦ ♦

లోకంలో అనేక రకాల వ్యక్తులుంటారు. అందులో ఒకరకం, తాము సంతోషపడలేరు, ఇతరులు ఆనందంగా వుంటుంటే చూచిసహించలేరు. వాళ్ళతోనే వస్తుందిచిక్కు.

కొంతమంది ఎన్నికష్టాలున్నా మెచ్చి సహించి వున్నదాంట్లోనే ఆనందం పొందడానికి ప్రయత్నిస్తారు. నావంటివాళ్ళు ఇలాంటివాళ్ళను చూస్తేనే పైన చెప్పిన రకానికి మరీకోపం.

జీవితపు విలువలు ఎవరెన్ని అనుకున్నా, జీవితపు కనీస ఆశయం సాధ్యమైనంతవరకూ సుఖపడడమనేది నిర్వివాదాంశమని నా విశ్వాసం.

పాటలమీద యిష్టత మూలాన, తరచు మే మిద్దరం సినిమాలకు వెళ్ళేవాళ్ళం. నీలవేణి కొన్ని పాటలకోసం ఒక సినిమా నే రెండు, మూడు సార్లు చూడడమో లేక ఆపాటల రికార్డులను సొంతానికి కొనడమో చేసేది.

సరాసరి జీవితాల్ని గడిపే మనుష్యుల సగటు జీతాలు కనీసావసరాలకే సరిపోని ఈ రోజుల్లో పై విధంగా డబ్బు ఖర్చుకావడం, నెలచివరి రోజుల్లో కొంచెంయిబ్బంది పడడం కూడ జరిగేది. ఎవరి దగ్గరకైనా చేబదులుకు వెడితే, అదే సమయమనుకునికసితీర్చుకుంటున్నట్లు"సతీసమేతంగా అన్ని సార్లు సినిమాలకు పోకపోతే నేం?" అని సణుక్కునేవారు— నాకు వినీ వినిపించకుండా! ఏదో అప్పివ్వడం 'దానం' క్రింద జమకట్టే స్వభావంతో. అది తెలిశాక కష్టమనిపించి, ఆర్థిక యిబ్బందు లకు తగిన ఏర్పాట్లు వేరే చేసుకున్నాను.

పాటలు పాడే వ్యక్తులవద్ద ఒక అలవాటు వుంటుంది. ఏదైనా పనిచేసుకొనేటప్పుడు కూనిరాగాలుతీస్తూ పని చేసుకున్న ట్లయితే, వాళ్ళుఎంతకష్టమైన పనినైనా అతిసులువుగాచేసినట్టు భావించుకుంటారు.

ఆ అలవాటు కే నీలవేణి బానిసైంది. వంట చేసుకుం టున్నా, ఇతరపనులలోనూ తనలో తనే పాడుకునేది. అందులో ఓ రకమైనఆనందం లేకపోలేదు. ఎంతపాటరాని వాళ్ళయినా, అనాలోచితంగా ఒక్కొక్కప్పుడు పాడేస్తుంటారు. నీలవేణి పాటలు నా పనులకుకూడా నేపథ్య సంగీతంలా తోడ్పడి ఉత్సా హంతో పనిచేసేవాణ్ణి అప్పుడప్పుడు ఆగని ఉద్రేకంతో, అను

కోకుండానే నేనూ గొంతు కలిపేవాణ్ణి అప్పుడు నీలవేణి స్థాయి నెక్కువచేసిపాడేది. ఇద్దరం అనిర్వచనీయమైన ఆనందంలో మునిగేవాళ్ళం.

ఒకసారి అలా పాడుకుంటూంటే పక్కింటావిడ అరుపులు పెనుతుపానులోని ఉరుముల్లా మా చెవుల్లో పడ్డాయి. "ఏమిటీ గోల పక్కయిళ్ళలో అద్దెకు వున్నారని, తెలుసుకోవద్దూ! బుద్ధిలేకపోతేసరి, వేళాపాళాఅక్కర్లేదు. పెద్దవాడే మొనగాళ్ళకై నాచెల్లదు." అంటూ! నీలవేణి నివ్వెరపోయింది. నేనూ విస్తుపోయాను.

"మర్నాడు దానికెందుకు మనగోల?", అంది నీలవేణి.

"రాళ్ళకంటెకూడా కఠినాత్ములు మనుష్యుల్లో వుంటారు" అన్నాను.

నీలవేణి బరువుగా నవ్వింది.

♦ ♦ ♦ ♦

మా సంసార జీవితంలో మూడు వసంతాలు గడిచాయి. అయినా తనివి తీరని కోరికతో జీవిత మాధుర్యాన్ని గోలిలడానికే మేము అనేక ప్రతిబంధకాలమధ్య ప్రయత్నాలు కొనసాగించేవాళ్ళం.

ఎప్పుడైనా పార్కువైపు యిద్దరం కల్సివేడితే నా వెనకాల చదువుకుని, ఎంతో సంస్కారం కలిగిన నా మిత్రులే "ఎందుకా పికాన్లు. తన కొక్కడికే భార్యున్నట్టు!" అనుకునేవారు – జీవితంలో ఆనందాన్ని చవిచూడని మూర్ఖుల్లా.

అది విన్నాక నీలవేణికి ఇతరుల పొడ కంటగింపు కలిగేది.

"అవేమీ పట్టించుకోకూడదు. ఏడ్చేవాణ్ణి ఇంకా ఏడిపిస్తారు. ఆనందించేవాణ్ణికూడా వాళ్ళతో బాటు ఏడ్పించాలని చూస్తారు. వాళ్ళకు ఆనందించడం చేతకాక - ఆనందించే ధైర్యం, హృదయవిశాలత్వంలేక వాళ్ళభార్యల్ని గృహాల్నుండి బయటకు రానీయరు. వాళ్ళకే ఆత్మవిశ్వాసం వుండదు. ఇంక భార్యలమీదేం నమ్మకంవుంటుంది? వాళ్ళసంస్కార భావాలన్నీ ఆత్మద్రోహం చేసుకొని నాలుక చివర్నించీ వెలువరించే పైపై మాటలే" అనేవాణ్ణి.

నీలవేణి అర్థమైనట్టు చూసేది.

♦ ♦ ♦ ♦

ప్రపంచాన్ని ఈర్ష్యా, అసూయా అనేటువంటి రాక్షసద్వయం పరిపాలిస్తోందని నా గట్టినమ్మకం. లేకపోతే మానవ జీవితాలు ఇంతగా బాధపడడానికి తగిన కారణం కనపడదు. నేనూ అప్రయత్నంగానే — కాదు. ఎంతగానో ప్రతిఘటించడానికి ప్రయత్నించినప్పటికీ ఆ రాక్షస కోరలమధ్య యిరుక్కోక తప్పలేదు.

కథంతా ఒకటి రెండు నెలల్లో జరిగింది. మా పక్కయింటి వాటా కాళీఅయింది. ఎవరో నా మిత్రుడే ఆ ఇంట్లోకి వచ్చాడు. మా మిత్రత్వానికి కారణంకూడా, అతడు పాటగాడు కావడమే! నాకంటే అతనికున్న అధికమైనవరం తియ్యగా పాడగలగడమే! అతనిపేరు రవీందర్.

ఒకరోజున స్నేహధర్మంగా అతన్ని మా ఇంటికి కాఫీకి పిల్చాను. అప్పుడే ఒకటి రెండు పాటలు పాడించాను. నీలవేణి కూడా వీణమీద రెండు మూడు పాటలు వినిపించింది. తర్వాత

వాళ్ళు సంగీతంమీద చర్చల్లోకి దిగారు. ఎంతో పరిచయులై పోయారు. సంగీతంమీద చర్చల్లో అతను ఎంతో విజ్ఞానాన్ని కలిగివున్నట్టు ప్రవర్తించాడు. నీలవేణి తన అనుమానాల్ని అడిగేది. అతను జవాబుచెబుతూ నాకేసి చూశేవాడు. నాకు సంగీతశాస్త్రంలో అంతపరిచయం లేదు. అందుకని ఆసంబంధంగా వాళ్ళ సంభాషణల్ని విననల్సింది. ఇంకా కొంతసేపు గడిచే టప్పటికి వాళ్లు నాఆస్థిత్వాన్నే మర్చారేమో ననిపించింది. నాలో ఈర్ష్యారక్కసుడు విజృంభించ సాగాడు. నేను తప్పు చెయ్యలేదు కదా ! హృదయాంతరాళాలలో నుండి సంస్కారం అందిస్తున్న సహాయంతో నేను ఈర్ష్యతో మల్లయుద్ధానికి తలపడ్డాను. అప్పటిమటుకు జయం నాదే !

♦ ♦ ♦ ♦

కొన్నాళ్లు గడిచాయి. నీలవేణి రవీందర్ గాన కళా రాధకురాలైంది. మా పరిచయం స్నేహంగా మారింది !

అతను తన గదిలోనుండి అస్తమానమూ ఏదో ఒక పాట అందుకునేవాడు. అప్రయత్నంగానో, అనాలోచితం గానో నీలవేణి కూడా ఆపాటను అందుకునేది. అసలు పాటలు పాడేవాళ్ళల్లో హెచ్చుగావుంటుం దీ లక్షణం. అది "ఎందు వల్ల?" అని నాలో తర్కం బయలుదేరింది.

మనస్తత్వశాస్త్ర దృష్ట్యా యిది సహజమే. ఒక చిన్న పిల్లవాడు ఏడిస్తే మరొకడు అందుకుంటాడు. ఒక దగ్గున్న వాడు దగ్గితే పక్కవాడూ దగ్గసాగుతాడు. నలుగురు ప్రయాణీకులు ప్రయాణంచేస్తుంటే ఒకడు ఏదైనా కొన్నట్లయితే తక్కినవాళ్ళంతా కొంటారు. లేకపోతే ఎవరూకొనరు. ఒకరికి

దాహం వేస్తే, అందరూ నీటికోసం వెతుకుతారు. మానవునిలో వున్న సహజమైన అనుకరణ (యిమిటేషన్) స్వభావఫలితమే అది! అలాగే అనుకుని చాలారోజులు వూరుకున్నాను. సహజ స్వభావానికి లేనిపోనివి ఆరోపించి బాధపడడం ఎందుకని?

ఒకనాడు మరో వాటాలో ఆయన పిల్చి కాఫీ యిచ్చి, అవీయివీమాట్లాడి, యిలాఅందుకున్నాడు. మీ మిత్రుణ్ణి కొంచెం కనిపెట్టి వుండండి. అతడు మీ అమాయకత్వాన్ని దోచుకుంటున్నట్టు అనిపిస్తోంది. ఎంతగా గానకళను ఆరాధించే వాళ్ళయినా, పరాయివాళ్ళ పాటని అందుకుని పాడడం... మీరు వున్నసంగతి గమనిస్తారనే వుద్దేశంతో ఈ మాత్రం స్వతంత్రం తీసుకుని చెప్పినందుకు మన్నించండి" అని

నా అభిమానం గాయపడింది. ఆవేళనించే రవీందర్‌తో స్నేహాన్ని తగ్గించివేశాను. నీలవేణిని మందలించాను. నీలవేణి మొహం నల్లబారింది.

♦ ♦ ♦ ♦

మళ్ళీ ఆవేళనుండి నా యింట్లో పాట వినపడలేదు. కూనిరాగాలకు తాళంపడింది. నా ఆఫీసుగొడవల్లో నేను పడి వున్నాను. అందువల్ల నీలవేణిని గమనించనట్టూరుకున్నాను. కాని లోపల అంతరాత్మ చావలేదు. అందుకని బాధ లేక పోలేదు. నీలవేణి పెళ్లాడింది. ఆవిడ పాటకోసమే ఈర్ష్యతో నేను పెంచిన లతని నేనే త్రెంపి వేస్తున్నాను?

అవును - రవీందర్! నిజంగా విలనే! కాకపోతే నా ప్రేమ కుసుమాన్ని తన గానకళాచాతుర్యాన్ని ప్రదర్శించి లోబరచుకో చూస్తాడా? మిత్రద్రోహి!

ఒకనాడు నేను యింటికి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి పది అయింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ రవీందర్ తన గాన తరంగాల్ని ప్రసరింపజేస్తున్నాడు. అంత విద్వేషంలో కూడా నేను ఆ పాటలోని మాధుర్యాన్ని గమనించకపోలేదు.

ఇంట్లోకి వెళ్లాను. నీలవేణి పనులన్నీ పూర్తిచేసుకున్న ట్లుంది. పడకగదిలోవుంవి. నిద్దరోతోంది గావును, అనుకున్నాను.

బయటవేషం తొలగించి దగ్గరకుపోయి చూద్దును గదా వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు ఎగపులు వినపడ్డాయి. నేను నివ్వెరబోయాను. ఎందుకని అంతదుఃఖం? గాన సరస్వతి కంఠం కట్టివేయబడిందనా ?

బయటనుండి మృదుమధురగాత్రం వినబడుతోనేవుంది. అంతమంచిపాటా నా కర్ణరంధ్రాల్లో శూలాల్లా గుచ్చుకో సాగింది. మా అశాంతికి కారణం- అవును - రవీందరే! నిజం !! నా వుద్రేకం మితిమీరింది.

వెంటనే తలుపుతట్టాను. రవీందర్ పాటనాపి తలుపు తీశాడు. దవడ పగిలింది. వెనక్కివచ్చి, తలుపు వేసుకొని పడుకున్నాను.

ఆ రాత్రి భోజనాల ప్రసక్తే లేదు.

♦ ♦ ♦ ♦

కొన్నిరోజులు గడిచాయి. రవీందర్ కూడ పాడ్డం మానివేశాడు. నాకళ్ళపడ లేదు. మనస్సులో ఏమనుకున్నాడో? నీలవేణికూడా పాటపాడడం అనే ఆలోచననే దరిదాపులకు రానీయడంలేదు. మూలబడిన వీణ మూగస్వరాల్తో మౌనంగా మూలుగుతో, దీనంగా చూస్తోంది.

ఇప్పుడు నీలవేణీ నేనూ తరుచు మాట్లాడుకోవడమే లేదు. పూర్వపు పాటలు, ఆటలు ఏమయ్యాయో? ఇప్పుడు కాలాన్ని ఎలా గడుపుతున్నామో నాకే తెలీదు.

నీలవేణి ఆరోగ్యంకూడా క్షీణించినట్టుంది. సరిగా భోజనం చేస్తున్నట్టులేదు ఏం? అని నేనూ అడగలేదు. ఆరోగ్యం బాగాలేదని ఆవిడా చెప్పలేదు.

మౌన దీక్షావ్రతం పూనినట్టుగా రోజులు దొర్ల సాగాయి.

♦ ♦ ♦ ♦

ఆవేళ మా యింట్లో సూర్యుడు ఎనిమిదిన్నర కుద యించాడు. నీలవేణి కాఫీతో సాక్షాత్కరించ లేదు మనస్సులో అదటు పుట్టింది. ఇది నీలవేణి కాపరానికి వచ్చిన ఈ నాలు గేళ్లలోనూ జరుగని సంగతి! మనస్సులో కలిగిన భయాన్ని ఎంతగా ననుకోకూడదనుకున్నా, ఇన్నాళ్లూ లోపల అణాగారిని చెడుఆలోచనలు, సుషుప్తావస్థనుండి వెలువడి, జాగ్రదావస్థ లోనికి వురికివస్తున్నాయి.

తిరిగి వచ్చేటప్పటికి వీణ మధ్య గదిలో తీగెలు తెగిపడి వుండడం చూశాను. నా హృదయ వీణాతంతువులు తెగినట్ట యింది. నెత్తిమీాదపిడుగు పడింది; నా కాలికిర్రింద నేల కరిగి పోతోంది! ఎదుటి దృశ్యాలు వర్తులాకారంగా గిరగిరా తిరగ జొచ్చాయి. మనస్సులోని ఆలోచనలు కట్టతెగిన నదీ ప్రవాహంలా ప్రవహించసాగాయి.

ఒక క్షణం ఆలాగే కుర్చీమీాద కూలబడ్డాను. దుఃఖం పొర్లుకొచ్చి కళ్ళునిండు గర్భిణీలైన మేఘాల్లామారాయి. ఒక

వేళ యిదంతా అనవసర భయమేమో! నీలవేణి ఏమవుతుంది? ఎందుకింత బెంగ?

ఎదుటి టేబిల్ మీద మడిచిపెట్టబడిన రోజారంగు కాగితం నా దృష్టి నాకర్షించింది; మా ఫొటో క్రింద పెట్టబడివుంది.

విప్పి చూశాను? నీలవేణి నా జీవిత నీలాకాశంలో మేఘాల్ని క్రమ్మి వెళ్ళిపోయింది.

అంతకీకారణం... ఆ తుచ్ఛుడు...రవీందర్! అతడు కనపడితే హత్యచేద్దామనిపించింది.

"మీచేత్తో మీరే నాలో కళాజ్యోతిని రగిలించి, ప్రజ్వలింపజేశారు. మీరే తిరిగి దాన్ని ఆర్పజూశారు" అది భరింపరానంత అన్యాయం!

మీలో కలిగిన మార్పు అనూహ్యం! మీ ఈ ప్రవర్తన మీ స్వభావానికే విరుద్ధం. మీ బ్రతుకుబాట ఈర్ష్య అనే కంటకమయమైంది. అందుకే నా జీవితపాట శృతి తప్పింది.

"అది మీకు తెలియజేసి, మీ జీవితాన్ని సుఖమయం చెయ్యడానికే నా ఈ చర్య! తిరిగి మరో లోకంలోనే కలయిక! మీ రాకకోసం ఎదురు చూస్తోంటాను.

"నా నేరాన్ని బాధపడుతో నన్నా క్షమిస్తారనే ఆశతో ఎప్పటికీ మిమ్మల్ని మరువలేని,

మీ

నీ ల వే ణి.

నీలవేణి ఆత్మహత్య చేసుకుని నాకు తగిన శాస్తి నివ్వాలనుకుంది. అయినా నీలవేణి మరణించలేదనే నానమ్మకం. అందుకనే వినపడే ప్రతీ మృదుమధురగాత్రంలోనూ, కోకిల నినదాలలోనూ, చిన్న పిల్లల తియ్యని గొంతుకల్లోనూ, నీలవేణి కంఠస్వరంకోసం వెతుకుతూ, అన్వేషకుడనై జీవిస్తున్నాను.

దూరంగా హోటల్‌నుండి లతామంగేష్కర్ పాట వినవస్తోంది. ఈ యాంత్రికయుగంలో కూడా పాటలుపాడే భార్యలకోసం యాతనపడడంలో వెర్రితనాన్ని వేనోళ్లతో చాటుతున్నట్టు.

—...—